సీరియల్ కథ :

# అభిరుచులు X

రచన :
"పుష్యమి"

సాయంకాలం అయిదు గంటలు అవుతోంది! అప్పటికింకా సూర్యాస్తమయం కాకపోయినా; కాంతి కిరణాలపై దాడిజరిపి, లోకాన్ని చీకటిగా చేస్తున్నాయి నల్లని మేఘాలు! ఆకాశమంతా చీకటి రేఖలు అలుముకున్నాయి! ఉరుములూ, మెరుపులూ కలసి హడావిడి చేస్తూ, ఆడుకునే పిల్లలకి మరింత ఆనందానిస్తున్నాయి! గాలి బాగా విసురుగా వీస్తోంది!

ఆ వాతావరణంలో పిల్లలు ఆనందంగా అటూ, యిటూ, పరుగులెడుతున్నారు. రకరకాల ఆటలు ఆడుకుంటున్నారు!

చిన్నగా చినుకు పడడం మొదలుపెట్టింది! ఆ చినుకులలో పిల్లలు యింకా ఉత్సాహంగా 'వానాలప్పా! తిరగాలప్పా!' అంటూ పాడుతూ గిరగిరా తిరుగుతున్నారు.

గాలివిసురెక్కువయింది! ఆ గాలి తాకిడికి రోడ్డు మీద దుమ్ము రేగుతోంది! ఆ దుమ్మువచ్చి కళ్ళల్లో పడగానే, పిల్లలు ఎక్కడివాళ్ళక్కడికి పరుగెత్తుకుపోయారు! ఎవరిళ్ళకి వారు చేరుకున్నారు.

చినుకు పెద్దదైంది!—గాలి మనుష్యుల్ని కూడా ఎగరకొట్టేలా వీస్తోంది.

దుమ్ముతో వళ్ళంతా, తలంతా నిండిపోయింది! వర్షపు చినుకులకి చొక్కా, లాగూ పూర్తిగా తడిసిపోయాయ్! అయినా;—అలాగే కళ్ళు మూసుకుని, 'వానాలప్ప' తిరుగుతున్నాడు రఘు!—సన్నగా తనలో తనే పాడుకుంటున్నాడు.

'వానాలప్పా!—అరగాలప్పా!' అని,

వంటింట్లోంచివచ్చి, వీధిలోకి చూచింది రత్నమ్మ! వానలో తడుస్తూ, గిరగిరా తిరుగుతున్నాడు రఘు!

'ఒరేయ్! ఏవిటిరా అది? అలాగేనా తడవటం?' అంది.

ఆమె మాటలు వినిపించుకోకుండానే పరుగెత్తాడు రఘు!

గాలికి కొబ్బరిచెట్టునుంచి మట్టొకటి రాలింది వీధిలో. అది లాక్కురావడానికి పరుగెత్తాడు!

'ఏరా! ఏ మట్టేనా నెత్తిమీదపడితే, ఆస్పత్రుల వెంట నే తిరగలేనురా! యిలా తగులాడే' అని అరిచింది.

వెనక్కైనా తిరిగిచూడకుండా పరుగెత్తి, మట్టచేత్తో పట్టుకుని లాక్కురావడం మొదలుపెట్టాడు రఘు.

ఆ మట్ట లాక్కుపోవడం చూసి; అంతవరకూ అరుగు మీద వున్నవాడు, ఒక్క అంగలోవచ్చి, రఘు రెండు చేతులూ పట్టుకున్నాడు కదలకుండా, సోమయ్య!

'ఏరా! మా యింటెదురుగా ఉన్న మట్ట రాలితే, నువ్వు పట్టుకుపోతున్నావే, నీ సొంతంలాగ?' అనడిగాడు.

'ఏడిశావులేవోయ్! నీ స్వంత చెట్టులాగే మాట్లాడుతున్నావే! ఎవరికి దొరికితే వారు తీసికెడతారు! నీఆడ్డేమిటి?'

'నా అడ్డేమిటా!—మా యింటెదురుగా వున్న చెట్టు కనక!''—

''కావలిస్తే మీయింటి ఎదుటి చెట్టు ఆకురాలినపుడు నువ్వు తీసుకో! ఎవరొద్దన్నారు!'

'ఏ చెట్టు ఆకురాలినా;—ముందెవరు చూస్తే వాళ్ళే తీసుకుంటారోయ్! పుల్లాయ్! మాయింటి ఎదుటి చెట్టు ఆకు రాలినప్పుడు, ముందు చూసి, పట్టుకెళ్ళు ఛావవుంటే!'

'ఎవరికి కావాలి, మీయింటెదురుగా ఉన్న చెట్టు మట్ట! నీకుమల్లా ఒకరింటి ఎదుటివి నేనేం మోసుకుపోను!—' అన్న సోమయ్యని వదుల్చుకుని, మట్ట లాక్కుని పరుగెత్తాడు రఘు!

సోమయ్య కోపంలో బలంగా పరుగెత్తి, రఘు జుట్టు పట్టుకుని, 'ఏరోయ్! చెపుతూంటే వినపడటంలేదూ?—వదులు మట్ట!' అని ఒక్క కుదుపు కుదిపాడు! రఘు జుట్టు నెప్పిపెట్టింది!—'అబ్బా!' అన్నాడు బాధగా!—మట్టమాత్రం వదల్లేదు.

'వదల్రా మట్ట!...వదులు!' తిరిగి తన చేతిలోవున్న రఘు జుట్టు ఒక్కసారి గుంజాడు సోమయ్య!

'అమ్మో!...' - అని బాధగా మూలిగి, జుట్టుపట్టి తప్పించుకోడానికి సోమయ్య చేతిని జుట్టునుంచి ఒక్క లాగు లాగాడు. రఘు!— సోమయ్య జుట్టు వదలి మట్టతో పరుగులంకించుకున్నాడు!

ఇదంతా గుమ్మంలోనుంచి నిలబడి చూస్తూనే ఉంది రత్తమ్మ! రఘు రెండో మారు 'అమ్మో!' అనగానే ఆమె కెక్కడలేని కోపం వచ్చింది!

రెండడుగుల్లో వచ్చి, మట్టతో పారిపోతున్న సోమయ్యని పట్టుకొని దవడమీద రెండు అంటించి, మట్ట లాక్కుంది!

ఆ దెబ్బతో సోమయ్య కళ్లు నీళ్లతో నిండాయి!

'వెళ్లు వెధవా! నీ బాబు సొమ్ములాగ చేతిలో మట్ట పట్టుకుని పరుగెడుతున్నావ్! జుట్టు పట్టుకు లాగుతావా? ఇప్పుడు చెప్పాక ఎవరితో చెప్పుకుంటావో!' ఆగ్రహంలో అరిచి, మట్ట బరబరా లాక్కొచ్చి దొడ్లో పడేసింది రత్తమ్మ! సోమయ్య ఏడుస్తూ యింటికి వెళ్లిపోయాడు. రఘు అమ్మ వెనక యింటిముఖం పట్టాడు!

అసలింతకీ:— ఆ వీధిలోవున్న కొబ్బరి చెట్లు యీ యిద్దరిలోనూ ఎవరి సొంతాలూ కాకపోవడమేవచ్చింది చిక్కు! స్థలాలమ్మే సుబ్బయ్య, యిల్లు కట్టుకుందుకు స్థలాలు మాత్రమే అమ్మి; ఆ కొబ్బరిచెట్లు అనవసరంగా వుంచుకున్నాడు! ఆ చెట్లు వీధిలో దూడలున్నవారికి మాత్రం పిడకలు చరుచుకోటానికి బాగానే ఉపయోగిస్తున్నాయి! అంతకంటె ఆ చెట్లవల్ల ఎవరికీ ఏమీ ప్రతిఫలం లేదు! ప్రతి నెలా, రోజైనా తేడా లేకుండా దింపు తీసి, కాయ తనింటికి చేరేసుకుంటాడు సుబ్బయ్య. ఇక దూడలుకూడా లేని మిగతా ఆ వీధిలోని వారికి మిగిలేదేమిటంటే; - దూడలున్న వాళ్ళు చరిచిన పేడపిడకల దుర్గంధం!! ఆ బాధ భరించలేని వాళ్ళంతా కలసి ఆ చెట్లు కొట్టెయ్యడానికి మ్యునిసిపాలిటీవారికి అర్జీ పెట్టుకుంటే, చెట్లకు పన్ను కడుతూన్న సుబ్బయ్య పలుకుబడి, ఆపని కాకుండా చేస్తోంది! ఎప్పుడేనా, ఏ చెట్టుకాయేనా ఖర్మవశాత్తూ రోడ్డుమీద పడితే, 'నా యింటిముందు' అని ఒకళ్ళు! 'నేను ముందు చూశా'నని మరోళ్ళు, తగవులాటలు మాత్రం మిగులుతున్నాయి!

అయితేనా; ఆ చెట్ల కాపలాకని వుంచిన గనిరాజుకళ్ళ, అమట్టా, కాయా, పడకుండా వుంటేనే! వాడు చూశాడంటే, ఏబాధా లేకుండా వాటిని తనింటికే చేరవేసుకుంటాడు! వాడు చూస్తుండగా, చెట్టు మొవ్వులోకి తలెత్తికూడా చూడనియ్యడు!

అలాగయినా, ప్రతీ శ్రీరామనవమికీ పందిరికని పాతికో, ముప్పయ్యో, ఆకులు కొట్టేస్తూనే వుంటారు కుర్రగాళ్ళు వాడి కళ్ళుగప్పి!

ఒక్క ఆకుగాను, కాయగానిపోతే, పంచప్రాణాలు పోయినంతగా బాధపడే సుబ్బయ్య; ఆరోజు ఆకు కొట్టేశారని తెలిస్తే, గనిరాజుమీద కారాలు మిరియాలూ నూరడమేకాదు! తాను వారం రోజులవరకూ అన్నం తినడు! తినడంటే; పాపం అసలు సహించదు పాపం!!

ఇలా నడుస్తోంది ఆ కొబ్బరిచెట్లగాధ! యింతకీ ఆ సమయానికి గనిరాజు లేక పోబట్టిగాని; సోమయ్యా, రఘూ తగువులాడుకోవలసిన పరిస్థితే రాకపోనసలు!

కొబ్బరి చెట్ట దొడ్లో పడేసి, లోపలికివచ్చి, తువ్వాలుతో తల తుడుచుకుంటూ బయటికి చూసింది రత్నమ్మ! ఆ చినుకులకి ఆమె తలకూడా కొంచెం తడిసింది! రఘు అరుగుమీద నుంచుని, చూరు నుంచి కారుతున్న వర్షం నీటికి చెయ్యి అడ్డుపెట్టి ఆడుతున్నాడు!

రఘు తలా, బట్టలూ పూర్తిగా తడిసిపోయాయి!

'ఓరి వెధవయ్యా! రోగాలొస్తే నే చెయ్యలేనురా! రాయిలా!— ఆ బట్టలు వదలి, తలతుడుచుకో!— రారా యిలాగ!' అని పిలిచింది. రఘు లోపలికి వచ్చాడు. చేతిలో తువ్వాలుతో రఘు తల తుడిచింది రత్తమ్మ!

'వర్షంలో ఎందుకు తడిశావురా?'

'కొబ్బరాకు తెద్దామని వెళ్లానమ్మా!'

'నిన్నెవరు తెమ్మన్నారు ఆ కొబ్బరాకు అసలు? ఆ కొబ్బరాకు తేవడమెందుకు?— ఆ వెధవతో దెబ్బలాడటమెందుకు! యిటువంటి దెబ్బలాటలూ, పేచీలూ తెస్తే, ఊళ్ళోవాళ్ళందరితోటీ అరుస్తూ కూర్చోడానికి నాకు ఓపిక లేదు! చూడు!...నువ్వూ తడిశావు; నేనూ తడిశాను! జలుబుచేస్తుందికూడాను!— వెళ్ళు! ఆ బట్టలు విప్పేసిరా!' అని రఘుని లోపలికి పంపి, తను వంటింటి వైపు నడిచింది.

(తరువాయి 22వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

చీకటిపడిపోయింది!—

వర్షంమాత్రం తగ్గలేదు! హోరున కురుస్తూనేవుంది. దీపం వెలిగించి, సావిట్లో పెట్టింది రత్తమ్మ! వీధి గుమ్మంలో లోపలవైపు కూర్చుంది! రఘు దుప్పటీ తెచ్చుకుని వళ్ళంతా కప్పుకుని, ఆమెనంటిపెట్టుకుని కూర్చున్నాడు!

రఘుకి తొమ్మిదోఏడు! అయిదో క్లాసు పాసయాడు. పదేళ్లు నిండనిదే, ఫష్టుఫారంలో చేర్చుకోనిమూలంగా, యింటిదగ్గరే ప్రయివేటు చెప్పిస్తున్నారు ఫష్టుఫారంలో చేర్చటానికి!

రత్తమ్మని అంటిపెట్టుకుని, 'అహాహా' అని వణుకుతున్నాడు రఘు!

'వెధవా వర్షంలో తడవడం ఎందుకు?—యిలా వణకటం ఎందుకు! రోగాలొస్తే నే చావాలి మీతోటి ఈ సారి వర్షంలో తడు చెప్తాను.' అని రఘుని యింకా దగ్గిరికి తీసుకుంది రత్తమ్మ! రఘు వెచ్చగా, వణకడం మానేసి కూర్చున్నాడు!

వర్షం జడి కొంచెం తగ్గాక రవి వచ్చాడు ఇంటికి. రవి బట్టలు కూడా పూర్తిగా తడిసిపోయాయి! వస్తూనే తిన్నగా గదిలోకివెళ్ళి బట్టలు మార్చుకుని, తల తుడుచుకున్నాడు.

రవికి పదమూడేళ్ళు! ధరుడు ఫారం చదువుతున్నాడు! బట్టలు మార్చుకుని, సావిట్లోకి వచ్చాడు రవి. రత్మమ్మ గుమ్మం దగ్గిర నుంచి లేచింది.

'ఏరా? స్కూలు ఎన్నింటికి వదిలిపెట్టారు?' అని అడిగింది.

రత్నమ్మవైపు భయంగా చూచాడురవి!

'అమ్మా! మా స్కూల్లో రేపు ఆదివారం ఏనివర్సరీ చేస్తున్నారమ్మా!' అన్నాడు చిన్నగా నవ్వటానికి ప్రయత్నిస్తూ! యింకా ఏదో చెప్పటానికి ప్రయత్నించే లోపలే. మధ్య రత్నమ్మ అందుకుంది.

'నీకు స్కూల్లో ఏనివర్సరీలు, అవీ అయితే కడుపు నిండిందా?—అసలేం చేస్తున్నావు స్కూల్లో యింత వరకూ?'

'మరేమో...మా స్కూల్లో రేపు ఏనివర్సరీకి నాటికలూ అవీ వేస్తున్నారు...'

'అయితే, నీకిక చదువువక్కరలేదన్నమాట? నాటకాల్లో దిగుతున్నావా?'

'మామాష్టారు నన్ను వారు నాటికలో వేషంవెయ్యమని బ్రతిమాలారమ్మా! 'వద్దండీ; మా అమ్మ తిడుతుంద'ని చెప్పినా వినక. బలవంతాన వప్పించారు.'

'అయితే, ఊళ్ళో అందరితోటి కూడా చెపుతున్నావన్నమాట, 'మా అమ్మ ఒక కర్కోటకురాలు! మా అమ్మ తిడుతుంద' అని.'

'అలా నేనేమీ చెప్పటం లేదు.'

'ఇంకెలా చెప్పావు? నన్ను కూడా వీధిని పడేస్తున్నావన్న మాట! నువ్వు నాటకాలు ఆడ్డానికి ఒప్పుకుంటే అమ్మ మంచిదీ; లేకపోతే చెడ్డదేనా? - అసలు నీకు ఈడునించీ నాటకాలేం? చదువు సంధ్యా అక్కరలేదా? పరీక్షపోతే ఎవరు చది చదివిస్తారనుకుంటావ్?' రత్తమ్మ రవిమీద విరుచుకుపడింది. రత్తమ్మ తీరు రవికి తెలుసు. అందుకే ఏమీ మాట్లాడలేదు. రవి మౌనంగా ఉన్నాడు. రత్తమ్మ తిరిగి గద్దించింది!

'ఏరా? నీకు చదువు కావాలా? నాటకాలు కావాలా?...చెప్పు!'

రవి నోరు మెదపలేదు! - రత్తమ్మ ఊరుకోలేదు! రవి చెవి మెలిపెడుతూ,

'నీ కిప్పటినించీ నాటకాలేం! చదువుకోరా అని బడికి పంపితే, నాటకాలూ అవీ అంటూ, యింటికి ఆరింటికీ వస్తే నీకోసం వెచ్చవెచ్చగా వండిపెడతాననుకున్నావా?' అని నడ్డిమీద నాలుగు చరిచింది.

రవికళ్ళు నీళ్ళతో నిండాయి!

'నేనివాళ ఒక్క రోజేకదమ్మా అలస్యంగావస్తా!' అన్నాడు ఏడుస్తూనే.

'ఇవాళ మాత్రం ఎందుకు ఆలస్యంగా రావాలనే అడుగుతూంట! నువ్వు ఏమయ్యావోనని, యింటి దగ్గర నేను బెంగపెట్టుకొని చావనా! నువ్వు యింటికి రాకపోతే ఎక్కడ దిగమారావోనని వెతుక్కుంటూ నేను రానా ఊరంట?'

ఆమె అలా అంటూంటే రవికి ఉక్రోషం వచ్చింది.

(సశేషం)